# మనస్తత్వం

‘కుమారి’

“నీలాంటి తెలివితక్కువదాన్ని పెండ్లి చేసికుంటానని నేను కలలోకూడ అనుకోలేదు. మీ తల్లిదండ్రులు, చుట్టాలు నిన్ను ఏకంగా వర్ణించి నాకు కట్టబెట్టారు. నీవు నా గృహలక్ష్మివని అందరూ అంటారు కాని నీలో నాకలాంటి లక్షణాలు ఏమి కనుపించుటలేదు. బుద్ధియున్నవాళ్లు ఒక్కసారి చెప్పితే గ్రహిస్తారు. నీ బోటిదానికి ఎన్ని చెప్పితే మాత్రం లాభముఏముంది! నీతోబాటు నా యింటికి కళకాంతులు వస్తవనుకున్నాను. సుఖసౌభాగ్యాలతో నన్నుద్ధరిస్తావని అనుకున్నాను. కాని నా ఖర్మం నీలాంటి మందమతిని పెళ్లాంగా సమకూర్చింది” అని గ్రుక్క తిప్పుకోకుండా ఆశాలత భర్త కసిరాడు.

ఆశాలతకు తన భర్త వైఖరి ఏమిఅర్థము కాలేదు. కారణములేకుండా ఆయన తన్నెందుకు దూషించాడో అయోమయంగానున్నది. భార్య అంటే తన చేతిలోని కీలుబొమ్మగా భావిస్తున్నట్లనిపించింది. స్కూలుఫైనలుదాక చదువుకొనిన ఆశాలత భర్త వైఖరిని సహించలేక ప్రతీకారానికి దారి వెదకింది. స్త్రీల బానిసత్వాన్ని రూపుమాపాలని పలుమారుపన్యాసాలిచ్చిన తానే బానిసనయిపోయానని బాధపడింది. భర్త అన్న ప్రతిమాట చెవులలో ముల్లతో పొడిచినట్లుండింది. ఇష్టంలేని పెండ్లి అతడెందుకు చేసికోవాలి? తన్నెందుకు బాధపెట్టాలి? ఆశాలత సహించలేకపోయింది. అంతులేని ఆవేశంతో “నన్ను పెండ్లిచేసికొమని నేను మీ కాళ్లు పట్టుకొని ఏనాడూ ప్రాధేయపడలేదే! మీరు నన్ను పెండ్లి చేసికొనకుండాయుంటే నాకువచ్చియుండే లోటేమియుండేదికాదు. హాయిగా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో బ్రతికేదానిని. ఇప్పటిలాగ ఊడిగపు చాకిరిచేస్తూ మీచేత నీచాతి నీచమైన మాటలు తినకుండానైనా తప్పిపోయేది” అన్నది.

ఆమె ముఖం కందగడ్డలాగ ఎర్రబడింది. కండ్లు నీళ్లతో నిండినవి ఆవేశంతో ఒళ్లు తెలియకుండా గజగజలాడిపోతున్నది.

భార్య ఎదురు మాటలకు రాజుకు అరికాలిమంట తలకెక్కింది. ఆమెను నమిలి మ్రింగేద్దామన్నంత కోపము వచ్చింది. కాలు కాలిన పిల్లిలాగ “నోర్ముయ్ - నీవు నన్నుద్ధరించలేకపోగా నన్ను, నా సంసారాన్ని నాశనంచేయ ఏర్పడ్డట్టున్నావు. నీలాంటిదియున్నా ఒకటే లేకున్నా ఒకటే.

ఆడదానివైపుట్టి నీ సౌభాగ్యాన్ని, నీ సంసారపు మంచి చెడ్డలను అర్థంచేసికొని నడచుకొనలేకున్నావు” అని చరచర ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఆశాలత కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. మంచముమీద పండుకొని దిండుమీద ముఖంపెట్టి భోరున ఏడువసాగింది. తన జీవితం తారుమారయిందని యూహించసాగింది. తన్నెంతో ప్రేమానురాగాలతో చూస్తూయున్న భర్త యిప్పుడు యింత నిర్దయగా, ఏహ్యంగా చూడడానికి, హింసించడానికి కారణము ఏమిటో అర్థముకాక తికమకపడసాగింది.

◆ ◆ ◆

ఆశాలతకు, రాజుకు వివాహమయి రెండు సంవత్సరాలయింది. కాపురానికి వచ్చినప్పటినుండి వాళ్లిద్దరు అన్యోన్యంగా నుంటుండేవారు. రాజు కోర్టునుండి వచ్చేసరికి ఆశాలత చక్కగా ముస్తాబయి కళకళలాడుతూ యింట్లోని వస్తువులు ఎక్కడివక్కడసర్ది ఎదురు చూస్తున్నట్లుగా నుండేది. రాజు యింటికిరాగానే తన శ్రమనంతా మరచిపోయేవాడు.

సంవత్సరము గడిచిన తరువాత ఆశాలతలో వచ్చినమార్పు రాజుకు చీకాకు కలిగించింది. ఆమె ఎందుకో పది రోజులనుండి బద్ధకంగా నుంటున్నది. సకాలానికి తలదువ్వుకోడంగాని, అన్నం తినడంకాని, మునుపటిలాగ యిల్లు సర్దడంకాని కనుపించదు. రాజు కోర్టునుండి వచ్చేసరికి ఏమూలనో చాపవేసికొని పడుకొనియుండేది. ఎక్కడిగుడ్డలక్కడ, ఎక్కడి వస్తువులక్కడ చిందరవందరగా నుండేవి. మునుపు తానింటికిరాగానే ఎంతో ఉత్సాహంగా కళాకాంతులతో కనుపించే ఆశాలత, యిలాగ మారిపోవడమునకు కారణము ఏమిటో యూహకందడములేదు. ఆమెను స్వయంగా అనేకసార్లు అడిగాడుకాని ఏమిలేనట్లుగా మౌనము వహించి తప్పించుకునేది.

ఆశాలత అయినా మునుపటిలాగుండాలని ఎంతగానో ప్రయత్నించేది. లేని ఓపికను, శక్తిని తెచ్చుకోవాలని ప్రయత్నం చేసేది. కాని రోజులు గడిచేకొద్దీ నీరసం, అశ్రద్ధ ఎక్కువ కాసాగినవి. రాజుకు ఆందోళన అధికమయింది. ఆమె అలాగుండటానికి తనేమైనా కారణమేమోనని మథనపడసాగాడు. ఏదో మనసులో నుంచుకొని తన్ను వేధిస్తున్నదని గట్టిగా కసరడంకంటె చేయకలిగింది కనుపించలేదు.

తనలోవచ్చిన మార్పును ఆశాలత గ్రహించినా దానికి కారణమును భర్తకు చెప్పుటకు సిగ్గుపడింది. కాని అంతమాత్రంచేత భర్త తన్ను తూలనాడటం

న్యాయంకాదని ఆమె మనసు ఘోషించింది.

డాక్టరు సుందరమూర్తిగారి కుమార్తె ఆశాలత. లేకలేక కలిగిన సంతానముగుట చేత ఎంతో గారాబంగాపెంచి విద్యాబుద్ధులు చెప్పించారు. ఆశాలత మంచి తెలివితేటలుకలది. మంచి వాగ్ధాటి కలిగి అనర్గళంగా చదువుకునే రోజుల్లో ఉపన్యాసాలిచ్చేది. స్త్రీల స్వాతంత్ర్యోద్యమమన్నా, మహిళాభ్యుదయమన్నా ఎంతో ఆసక్తి కనబరచేది. సాధ్యమైనంత వరకు స్త్రీ ఉద్యోగం చేయాలి. తర్వాతనే వివాహంచేసికోవాలి. అప్పుడుగాని పురుషునితోబాటు సమాన గౌరవ మర్యాదలతో జీవయాత్ర సాగించడాని కవకాశ ముండదని గంటాపథంగా ఉపన్యాసాలిచ్చేది.

ఆమె ఉపన్యాసాలను విన్నవారు ముగ్ధులయ్యేవారు. తల్లిదండ్రులు సయితం తమ కుమార్తె అభిప్రాయాలను గమనించి సాధ్యమైనంత త్వరగా పెండ్లిచేయడం మంచిదని స్కూలుఫైనలుకాగానే సుందరమూర్తిగారు ఆశాలతకు సంబంధాలను వెతకనారంభించారు.

ఆశాలత మాత్రం తన కింతలో వివాహం జరుగనున్నదనుకోలేదు. ఎప్పటియట్లు బ్యాడ్మింటన్ ఆడుకొని యింటికి వచ్చి ముఖము కడుక్కొంటుండంగా పనిమనిషివచ్చి "అమ్మగారూ! పెళ్ళివారు వచ్చారు - రేపోమాపో మీ పెళ్ళి" అని ముసిముసి నవ్వులు నవ్వింది.

ఆశాలత మండిపడి "నోర్న్యాన్స్" అని గద్దించి యింట్లోకి వెళ్ళింది.

తల్లి పట్టుచీర, జాకెట్టు తెచ్చియిచ్చి సింగారించ పూనుకునేసరికి ఆశాలత గుండెల్లో గుర్రాలు పరుగెత్తసాగినవి. అప్రయత్నంగా ఆమె కండ్లవెంట జలజల నీరుకారినవి. బలవంతంగా ఆమెను ముస్తాబుచేయాల్సివచ్చింది.

ప్రక్క గదిలో సుందరమూర్తిగారు పెండ్లికొడుకుతో "రాజూ! అమ్మాయికి పెళ్ళిచేసి అచ్చటా, ముచ్చటా చూడాలని యుంది. ఇక నీదే ఆలస్యం" అంటున్న మాటలు లీలగా వినబడుతున్నవి.

ఆశాలతను పెళ్ళివాళ్లు చూడడానికి గదివదలి బయటికిరమ్మని ఎంతబ్రతిమాలినా వచ్చిందికాదు. కాబోయే పెళ్ళికొడుకే స్వయంగావచ్చి చూడాల్సివచ్చింది ఆమెను.

ఏడ్చిఏడ్చి ఎర్రబడిన కళ్లతో, చెరిగిన తలతో నున్నప్పటికి ఆశాలత అందచందాలకు ముగ్ధుడయ్యాడు రాజు. పైగా చదువుకున్న పిల్లను తన ఆశయం ప్రకారం వివాహం చేసికోబోతున్నానుకదాయని తృప్తిపడ్డాడు.

అక్కడినుండి వెళ్లబోతూ "ఆశాలతా దేవిగారూ! శలవు" అని చిరునవ్వుతో ఆమె కళ్ళలోకి చూచాడు.

"మహారాజుగా వెళ్ళండి! - మిమ్ములను రక్షించేది ఎవరు!" అన్నది పెల్లుబికే దుఃఖావేశాలతో.

రాజు ఆశాలతను కట్నకానుకలు లేకుండా వివాహమాడ సమ్మతించాడు. రాజుకు 20 యకరాల మాగాణిభూమి, యిల్లు, వాకిలి యున్నవి. పైగా వకీలు వృత్తి; సుందరమూర్తికి సయితం సంబంధము అన్ని విధాల నచ్చింది.

ఆశాలతకు మాత్రం తానింత త్వరగా పెండ్లిచేసికోడం యిష్టంలేదు. తల్లిదండ్రులకు నచ్చచెప్పాలని ఎంతో ప్రయత్నం చేసిందికాని లాభంలేకపోయింది. తల్లిదండ్రుల మాటకు ఎదురు తిరిగితే లోకులు తానొక్కగానొక్కబిడ్డ ఎదురుతిరిగిందని అంటారనే అపనిందకు భయపడింది. ఎలాగైతేనేం వైభవంగా వివాహం జరిగింది.

రాజు ఆశాలతను ప్రేమదేవతగా ఆరాధించాడు. ఆమె అతనిని అనుసరించి, వారిద్దరి అనురాగ దాంపత్యాన్ని చూచి తల్లిదండ్రులు భగవంతునికి కృతజ్ఞతను వెల్లడించారు. ఇంటబయటకూడ వారి ఆదర్శదాంపత్యమునుచూచి ముచ్చటపడేవారు.

♦ ♦ ♦

రాజు ఏకాంతముగా ఒక పార్కులో కూర్చొనియున్నాడు. తన తొందరపాటుకు పశ్చాత్తాపపడ్డాడు. కాని కారణం తెలియకుండా ఆశాలత అలాగ క్రుంగి కృశించిపోతుంటే తనెంతకాలమని ఉదాసీనంగా నుండగలడు? తానడిగితే చెప్పదాయె! ఏదో ఉన్నట్లేయుండి ఆలోచన తట్టింది. లేచి నేరుగా లేడీ డాక్టరు యింటికివెళ్ళి టాక్సీలో ఆమెను యింటికి తీసికొనివెళ్లాడు.

డాక్టరు ఆశాలతను పరీక్షచేసి గదిలోనుండి బయటికివచ్చి హాలులో కూర్చుంటూ "రాజుగారూ! మీకు కొడుకో, కూతురో పుట్టబోతున్నది" అన్నది నవ్వుతూ.

రాజు, ఆశాలత ఒకరి ముఖం ఒకరు చూచుకొని తలలు వంచుకున్నారు. డాక్టరు వెళ్లిపోయిన తరువాత రాజు భార్యను సమీపించి "ఆశా! యీ విషయమని నాకెందు కిదివరకు చెప్పకపోయావు! నీవు రోజు రోజుకు నీరసించిపోతుంటే నేనేమని అనుకోవాలిచెప్పు! - చూడు ఆశా! చీకాకులో నిన్ను కసిరాను - క్షమించవూ!" అన్నాడు.

"చాలులెండి - నోటికివచ్చినట్లుతిట్టడం మీవంతే, క్షమించమనికోరడం మీవంతే - ఆడవాళ్లంటే మీ దృష్టిలో అంత తేలికగానున్నారు" అన్నది ఆశాలత.

"సరే ఆశా! నీవు పరిహాస్యాన్నైనా నా దగ్గర దాచవద్దు సుమతీ! — ని ఆరోగ్యాన్ని గురించి నేను ఆదుర్దాపడుతుంటే నీవు నిర్లక్ష్యంగా వుంటుంటే నాకెలాగుంటుందో యూహించు! — ఏదో ... లాంటి నాటకాలలో అన్నావు - క్షమించవూ" అని ప్రాధేయపడ్డాడు.

ఆశాలత రాజా ముఖాన్ని సానుభూతితో చూచింది. క్రమంగా ఆశాలతకు ఆరోగ్యంచేకూరి నవమాసములు నిండగానే పండంటి కుమారుడు పుట్టాడు.

డాక్టరు సుందరమూర్తి దంపతులు పసిపాపని ముద్దాడుతుంటే రాజా, ఆశాలత చిరునగవుతో కొంటెగా చూచుకొని ముసిముసి నవ్వులు నవ్వారు.

నాసిక్‌లో జరిగిన అంతర్జాతీయ విద్యార్థుల సేవా శిబిరములో 72 దేశాలకు చెందిన 15 మంది బాలికలు 114 మంది యువకులు పాల్గొన్నప్పటి దృశ్యము.